నేడు భగత్‌సింగ్‌నగర్‌ హడక్‌ కమిటీ సమావేశం

చింతల్‌: భగత్‌సింగ్‌నగర్‌ కాలనీ నూతన సంక్షేమ సంఘాన్ని ఎన్నుకోవడానికి ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు హడక్‌ కమిటీ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. భగత్‌సింగ్‌నగర్‌ మల్టీపర్పస్‌ ఫంక్షన్‌ హాలులో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి స్థానిక ప్రజలు, రాజకీయ పక్షాల నాయకులు పాల్గొని నూతన కమిటీ ఎన్నికలో సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

సన్మానం



జగద్గిరిగుట్ట: ఇటీవలే జగద్గిరిగుట్ట సీఐగా బాధ్యతలు చేపట్టినా వెంకటేశంని శనివారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌ జే కే శేఖర్‌ యాదవ్‌ సన్మానించారు. సామాన్యులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ రావుల శేషగిరి, రాజుయాదవ్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేయించుకుంటున్న రామేశ్వర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్‌: స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న వైద్య సేవలు పేద, మధ్య తరగతి ప్రజలకు వరమని ట్రస్మా రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ బాపునగర్‌లోని ఆర్‌.ఎస్‌.కే ఉన్నత పాఠశాలలో లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ సికింద్రాబాద్‌ నార్త్‌ ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో ప్రారంభించారు. శిబిరంలో 700 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ సికింద్రాబాద్‌ నార్త్‌ అధ్యక్షుడు బిర్రు ఆంజనేయులు, ట్రపసా గ్రేటర్‌ కుత్బుల్లాపూర్‌ అధ్యక్షుడు వినోద్‌ జాదవ్‌, ఎస్‌.ఆర్‌. భాషా, వైష్ణవి గ్రూప్‌ ఆఫ్‌ చైర్మన్‌ చెప్యాల నర్సింహులు గౌడ్‌, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైమాస్ట్‌ లైట్లు ప్రారంభం



హైమాస్ట్‌ లైట్లను ప్రారంభిస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

రంగారెడ్డినగర్‌: శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలను మెరుగు పర్చాలని గాంధీనగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాఘవులు అన్నారు. శనివారం గాంధీనగర్‌ హిందూ శ్మశాన వాటికలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్‌ లైట్లను ప్రారంభించారు. సదుపాయాలు లేక దహన సంస్కారాలకు వచ్చే జనం ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు ఈ విషయమై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేకల ఎల్లయ్య, వాజీద్‌, లక్ష్మీనాథ్‌, బిక్షపతి, శ్రీనివాస్‌, ప్రకాష్‌, తిమ్మయ్య, నవీన్‌, సందీప్‌, అజయ్‌, ఆనంద్‌, వీర స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ల పునరుద్ధరణకు చర్యలు



ఏఈ శ్రీనివాసులు

జగద్గిరిగుట్ట : వినియోగదారుల అవసరాల దృష్ట్యా విద్యుత్‌ లైన్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు కొంపల్లి ఏఈ శ్రీనివాసులు తెలిపారు. సెక్షన్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం బస్తీబాట నిర్వహించి వినియోగదారుల ఫిర్యాదుల పై వచ్చిన సమస్యలను పరిష్కరించారు. సెక్షన్‌లో 34 వేల కనెక్షన్లు ఉండగా దూలపల్లి, కొంపల్లి సబ్‌ స్టేషన్లు ఇందుకు అనువుగా ఉన్నాయని పేర్కొన్నారు. 1480 ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్‌ సరఫరా చేస్తున్నామని, 11 కె. వి ఫీడర్లు 21 ఉన్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. మరో ఆరు ప్రాంతాల్లో 11 కె. వి ఫీడర్లు ప్లాన్‌ చేస్తున్నామని, అదనంగా 20 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మరో 8 కిలోమీటర్లు ఎల్టీ లైన్‌ పునరుద్ధరించే విషయంపై ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.



షాపూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాలు



డప్పు కొట్టి నిరసన తెలుపుతున్న కొంపల్లి బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్‌



బంద్‌లో పాల్గొన్న కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంతరెడ్డి తదితరులు

బంద్‌ సక్సెస్‌

దుకాణాలు బంద్‌.. స్తంభించిన ఆర్టీసీ సేవలు

- పాల్గొన్న అఖిలపక్ష నాయకులు
- బీసీలకు రిజర్వేషన్‌ కల్పించాలని డిమాండ్‌



ప్రగతినగర్‌లో నిరసనలో పాల్గొన్న వామపక్ష నాయకులు



బంద్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌

కుత్బుల్లాపూర్‌: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన బీసీ రిజర్వేషన్ల బంద్‌ నియోజకవర్గంలో విజయవంతంగా జరిగింది. ఉదయమే ఆయా పార్టీల నాయకులు దుకాణాలను మూయించారు. జీడిమెట్ల బస్సు డిపో వద్దకు చేరుకుని బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ముందస్తుగా డిపో వద్ద పహారా కాశారు. వామపక్షాలు, కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున రోడ్లపైకి చేరుకుని ర్యాలీలు నిర్వహించారు. కొంపల్లి, ప్రగతినగర్‌, జీడిమెట్ల ప్రాంతాల్లో బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. షాపూర్‌నగర్‌ ప్రధాన రోడ్డులో వామపక్షాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ రిజర్వేషన్ల బిల్లును చట్టంగా చేయాలని డిమాండ్‌ చేశారు. నిజాంపేట్‌, ప్రగతినగర్‌లలో బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు, మధ్యాహ్నం తరువాత బస్సులు రోడ్డెక్కాయి.



జీడిమెట్ల బస్సు డిపో ఎదుట ..



జీడిమెట్ల డిపోలో నిలిచిన బస్సులు



ప్రగతినగర్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులు



కుత్బుల్లాపూర్‌-ఏ బ్లాక్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ ఆధ్వర్యంలో నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్‌ కార్యకర్తలు



జగద్గిరిగుట్ట లాస్ట్‌ బస్టాప్‌ వద్ద పాల్గొన్న బీసీ హక్కుల సాధన సమితి ప్రతినిధులు



గండిమైసమ్మ చౌరస్తాలో బంద్‌లో పాల్గొన్న కాంగ్రెస్‌ నాయకులు

చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగింత



చిన్నారులను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

మూసాపేట: తప్పిపోయి పోలీస్‌స్టేషన్‌కు చేరిన చిన్నారులను క్షేమంగా గూగుల్‌ మ్యాప్‌ ద్వారా వారి తల్లిదండ్రులకు కూకట్‌పల్లి పోలీసులు అప్పగించారు. కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌ వద్ద ఒంటరిగా ఉన్న చిన్నారులను స్థానికులు కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో మెట్రో స్టేషన్‌ వద్ద ఇద్దరు చిన్నారులు ఒంటరిగా ఉండటంతో 100కు డయల్‌ చేసి సమాచారం ఇచ్చారు. కూకట్‌పల్లి పోలీసులు చిన్నారులను తీసుకువచ్చి పోలీస్‌స్టేషన్‌లో వారి సంరక్షణలో ఉంచారు. అరవింద్‌ (4), జయశ్రీ (4) అని చిన్నారులు తెలిపారు. గూగుల్‌ మ్యాప్‌లో బాబు తమ భవనం గుర్తు పట్టడంతో పోలీసులు తీసుకెళ్లి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

పైపులైన్‌ పనులు పూర్తి చేయాలి

మోతీనగర్‌: పైపులైన్‌ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్‌ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని యూసుఫ్‌ నగర్‌లో శనివారం మంజీర టాన్స్‌మిషన్‌ వాటర్‌ పైపులైన్‌ జంక్షన్‌ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరంగా మంచి నీటి సరఫరా అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు.

సవాల్‌గా భూముల పరిరక్షణ!

మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ, అసైన్డ్‌ భూములు

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల పరిరక్షణ అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారుతోంది. ధన, అధికార బలమున్న పెద్దలకు కొందరు ఉద్యోగులు తలొగ్గుతుండగా, మరికొందరు అమ్యామ్యాలకు లాలూచి పడి.. భూమార్పిడిలోని లోసుగులను అనుకూలంగా మల్చుకుని తప్పుడు చర్యలకు ఒడిగడుతున్నారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన కొందరు రాజకీయ పెద్దలు వాటిని భక్షించేందుకు పన్నుతున్న కుట్రల్లో పలువురు అధికారులు, ఉద్యోగులు పావులవుతున్నారు. దీంతో భూపరిరక్షణ పెద్ద టాస్క్‌గా తయారైంది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, అసైన్డ్‌ భూములకు రక్షణగా నిలిచి.. వాటి ఆక్రమణలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే పటిష్ట వ్యవస్థ లేకపోవడం కూడా భూ పరిరక్షణ రెవెన్యూ శాఖకు ఇబ్బందికరంగా మారింది. డివిజన్‌ స్థాయిల్లో గతంలో లాగా భూపరిరక్షణకు టాస్క్‌ఫోర్స్‌ టీంలు లేకపోవడంతో కూడా సులవుతోంది. ఈ క్లిష్ట తరుణంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ ధ్యేయంగా సర్వే నిర్వహించిన రెవెన్యూ యంత్రాంగం సాంకేతికంగా కిహోల్‌ మార్కప్‌ లాంగ్వేజ్‌ (కేఎంఎల్‌) మ్యాప్‌ (గూగుల్‌)లో పొందుపర్చడం ద్వారా పటిష్ట చర్యలకు పూనుకుంటోంది.

మండలాల వారీగా భూముల గుర్తింపు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసైన్డ్‌ భూముల వివరాలను మరోసారి పరిశీలించి, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది. భూముల సంరక్షణ బాధ్యత ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్లపైనే ఉందని పేర్కొంటున్న జిల్లా యంత్రాంగం.. గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీలు, ఫెన్సింగ్‌ వంటి పనులు చేపట్టడంపై దృష్టి సారిస్తోంది.



కబ్జాదారుల కబంధ హస్తాల్లో ..

జిల్లాలోని 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ శాఖ ఇందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి.. ఎంత సంరక్షణలో ఉందన్న సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. బాలానగర్‌ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది. శామీర్‌పేటలో 420, దుండిగల్‌ గండిమైసమ్మలో 425, మేడిపలిలో 900, ఘట్కేసర్‌లో 500, కాప్రాలో 400, కీసరలో 417, కుత్బుల్లాపూర్‌లో 600, బాచుపల్లిలో 360, ఉప్పల్‌లో 333.13, మల్కాజిగిరిలో 113.06, మేడ్చల్‌ మండలాల్లో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

అసైన్డ్‌ భూములెక్కువనే..

జిల్లాలో 2004 సంవత్సరానికి ముందు 116 రెవెన్యూ గ్రామాలు, పలు ప్రాంతాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను పంటల సాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. ఘటేస్కర్‌ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేటలో 30 గ్రామాల్లో 1451, కీసరలోని 16 గ్రామాల్లో 1500, మేడ్చల్‌లోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్‌లోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286, కుత్బుల్లాపూర్‌లోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్‌ భూములను అప్పటి ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. ఇందులో చాలావరకు వెంచర్లు, రియల్‌ ఎస్టేట్‌ వెంచర్లు, అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్‌ ఇండ్లు, ప్రైవేట్‌ విద్యా సంస్థలు, ఆసుపత్రులుగా మారినట్లు తెలుస్తోంది.

కోర్టుల్లో కేసులు..

జిల్లాలో భూసంబంధిత కోర్టు కేసులు 706 ఉన్నాయి. ఇందులో మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్‌ పరిధిలో 349, కీసర డివిజన్‌లో 357 ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే వివిధ కోర్టుల్లోని కేసుల వివరాలు సుప్రీంకోర్టులో 1, హైకోర్టులో 481, జిల్లా కోర్టులో 65, లోకాయుక్త కోర్టులో 57, ఎల్‌డీ కోర్టులో 63, సివిల్‌ కోర్టులో 6 కేసులు కొనసాగుతున్నాయి. కోర్టు ధిక్కారంలో కూడా పలు కేసులు ఉన్నట్లు తెలుస్తోంది.

వివాదంలోని భూములివే..

మేడ్చల్‌ జిల్లాలో భూవివాదాలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం వివాదాస్పద భూములు 12,073.17 ఎకరాలు ఉన్నాయి. ఇందులో సివిల్‌ కోర్టు పరిధిలో భూములు 2,485 ఎకరాలు కాగా, రెవెన్యూ కోర్టు పరిధిలో 904 ఎకరాలు ఉన్నాయి. ఇతర వివాదాలతోపాటు ఎండోమెంట్‌, వక్ఫ్‌, అటవీ, వ్యక్తిగత వివాదాల పరిధిలో 2,466 ఎకరాలు, అసైన్డ్‌ భూముల కేటాయింపుల్లో భాగంగా 1603 ఎకరాల భూములు కూడా వివాదాల్లో ఉన్నాయి.

విద్యాసంస్థల్లో దీపావళి వేడుకలు



రంగారెడ్డినగర్‌: కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గంలో దీపావళి వేడుకలు ముందుగానే జరిగాయి. చింతల్‌ అక్షర ఇంటర్నేషనల్‌ పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్‌ జానకి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో చిన్నారులు టపాసులు కాలుస్తూ సందడి చేశారు. విద్యార్థులకు దీపావళి పర్వదినం ప్రాముఖ్యత వివరించారు. అదేవిధంగా గాజుల రామారం శ్రీనిధి గ్లోబల్‌ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్‌ శ్రీదేవి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పర్యావరణానికి హాని కలిగించే టపాసులు కాల్చవద్దని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఆవరణలో రంగవల్లికలు వేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి టపాసులు కాల్చారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేత

సుభాష్‌నగర్‌: నిత్యం తమ చెమటను చిందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని బీజేపీ మేడ్చల్‌ జిల్లా కౌన్సిల్‌ మెంబర్‌ కంది శ్రీరాములు అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా సుభాష్‌ నగర్‌ డివిజన్‌ సూరారం కాలనీలో పనిచేస్తున్న 30 మంది పారిశుద్ధ్య కార్మికులకు, వాటర్‌ వర్క్‌ సిబ్బందికి చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండనక వాననక ప్రతిరోజు కాలనీలను, బస్తీలను శుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ కార్మికుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీపతి రాజు, పులి బలరాం, భీమ్రాజ్‌, విట్టల్‌ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న కంది శ్రీరాములు

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు

అల్విన్‌కాలనీ: డివిజన్‌ పరిధి పీజేఆర్‌ నగర్‌లోని నాయి బ్రాహ్మణుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ధన్వంతరి జయంతి వేడుకలకు కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ హాజరయ్యారు. ధన్వంతరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరి అన్నారు. వ్యాధుల నివారణకు ధన్వంతరి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్యరంగంలో ఆయన చేసిన సేవలు మరువ లేనివని తెలిపారు.

పోలీసుల త్యాగం మరువలేనిది

- బాలానగర్‌ ఏసీపీ పింగళి నరేష్‌రెడ్డి
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా రక్తదాన శిబిరం

జీడిమెట్ల: సమాజంలో లా అండ్‌ ఆర్డర్‌ పరిరక్షణకై తమ ప్రాణాలు త్యాగం చేసిన పోలీసులు మన మదిలో వీర జవానులు అని బాలానగర్‌ ఏసీపీ పింగళి నరేష్‌రెడ్డి అన్నారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌ గడ్డం మల్లేష్‌ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీడిమెట్ల పోలీసులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా రక్తాన్ని సేకరించేందుకు నిమ్స్‌ ఆస్పత్రితో పాటు తలసేమియా బృందం రక్తాన్ని సేకరించారు. జీడిమెట్ల పీఎస్‌ పరిధిలో ఉన్న యువకులు, పాత్రికేయులు, పోలీసులు, పరిశ్రమల ఉద్యోగులు, కాలనీవాసులు పెద్దఎత్తున రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారిని ప్రశంసిస్తూ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీఐ ఎస్‌ఐలు సత్యనారాయణ, నాయుడు, శ్యాం బాబు, సురేష్‌గౌడ్‌, ఏఎస్‌ఐలు, హెడ్‌ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ నరేష్‌రెడ్డి

స్పందన భేష్‌

రక్తదాన శిబిరం గురించి ముందుగానే కాలనీల్లో వాట్సాప్‌ గ్రూపుల్లో, వీడియోలు పోస్ట్‌ చేసి అవగాహన కల్పించాం. 300 యూనిట్ల రక్తం సేకరించవచ్చని అనుకోగా.. 416 యూనిట్లు సేకరించడం గొప్ప విషయం. సిటిజన్స్‌ వారంతట వారే ముందుకు రావడం అభినందనీయం.

- గడ్డం మల్లేష్‌, ఇన్‌స్పెక్టర్‌ జీడిమెట్ల

స్టీల్‌ బ్రిడ్జి నిర్మాణానికి రంగం సిద్ధం!

క్షేత్రస్థాయి పరిశీలనలో ట్రాఫిక్‌ పోలీసులు

కుత్బుల్లాపూర్‌ : స్టీల్‌ బ్రిడ్జి నిర్మాణానికి మరో రెండు మూడు రోజుల్లో మోక్షం కలగనుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించేందుకు సైబరాబాద్‌ ట్రాఫిక్‌ జాయింట్‌ కమిషనర్‌ గజారావు భూపాల్‌, మేడ్చల్‌ ట్రాఫిక్‌ జోన్‌ డీసీపీ రతన్‌ రంజన్‌ కుమార్‌, కూకట్‌పల్లి జోనల్‌ ఇంజినీరింగ్‌ అధికారులు, ప్రాజెక్టు అధికారులు ప్రతిరోజు ఈ ప్రాంతాన్ని పరిశీలిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ పరిధిలోని ఒకవైపు సుభాష్‌ నగర్‌ మరోవైపు జీడిమెట్ల డివిజన్లకు అనుసంధానంగా ఉన్న సుభాష్‌ నగర్‌ పైపులైన్‌ రోడ్డు రంగా భుజంగా థియేటర్‌ నుంచి జాతీయ రహదారి దివాన్‌ దాబా వరకు ఎన్నో ఏళ్ల నుండి రాకపోకలు సాగిస్తూ వస్తున్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడకు వివిధ ఉత్పత్తులను తీసుకువెళ్లే భారీ వాహనాలు ఈ ప్రాంతం నుంచే వస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఇరుకుగా ఉన్న రోడ్డును వెడల్పు చేసే కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు అధికారులు సుమారు 56 కోట్లతో స్టీల్‌ బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు.

ట్రాఫిక్‌ సమస్యపై అధ్యాయనం...

షాపూర్‌ నగర్‌ నుంచి జీడిమెట్ల గ్రామం మీదుగా జాతీయ రహదారికి చేరుకునే ఈ రోడ్డులో స్టీల్‌ బ్రిడ్జి ఏర్పాటు కోసం పనులు ప్రారంభిస్తే తీవ్ర ట్రాఫిక్‌ సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకవైపు ట్రాఫిక్‌ పోలీసులు, మరోవైపు జీహెచ్‌ఎంసీ అధికారులు అధ్యయనం చేస్తున్నారు. జీడిమెట్ల జేఏటీఈఎల్‌ రోడ్డు మీదుగా దూలపల్లి నుంచి కొంపల్లికి భారీ వాహనాలను మళ్లించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇంకోవైపు కుత్బుల్లాపూర్‌ సుచిత్ర మీదుగా వాహనాలను మళ్లించనున్నారు. ఇక్కడ పనులు ప్రారంభం అయినప్పటి నుంచి సుమారు సంవత్సరం పాటు పైపులైన్‌ రోడ్డు మొత్తం మూసివేసే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రతిరోజు అధికారుల బృందాలు పర్యటిస్తున్నాయి. ప్రస్తుతం పైప్‌లైన్‌ రోడ్డు.. కుత్బుల్లాపూర్‌ రోడ్డు.. జీడిమెట్ల పారిశ్రామిక రోడ్డు వాహనాలు వెళ్తున్నాయి. పైప్‌లైన్‌ రోడ్డు మూసివేస్తే మరింత ఈ రెండు ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్‌ సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. దానికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు.



పైపులైన్‌ రోడ్డులో స్టీల్‌ బ్రిడ్జి నిర్మాణం జరిగే ప్రాంతం



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న సైబరాబాద్‌ ట్రాఫిక్‌ జాయింట్‌ కమిషనర్‌ గజారావు భూపాల్‌

వాటిని తొలగించాల్సిందే..

ఇప్పటికే ఈ రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా పలువురికి నోటీసులు జారీచేసి నష్టపరిహారం అందించే దిశగా ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 123 ఇళ్ల యజమానులను గుర్తించి నోటీసులు అందజేసినట్టు తెలిసింది. రూ 56 కోట్లతో చేపట్టనున్న ఈ స్టీల్‌ నిర్మాణం 15 మీటర్ల వెడల్పుతో 310 మీటర్ల పొడవుతో ఏర్పాటు చేయనున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే ఒకవైపు రాష్ట్ర రహదారి, మరోవైపు జాతీయ రహదారికి వెళ్లే వాహనాలకు నాలుగు వరుసల దారి ఏర్పడనుంది. సెంట్రల్‌ లైటింగ్‌ సిస్టం పాదాచారులకు అనువుగా ఉండేందుకు ఫుట్‌పాత్‌ ఏర్పాటు చేయనున్నారు.